షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక
RNI : APTEL / 2023 / 89152
1st Year Happy Work Anniversary.
Good for Health
Best for Readers
సంపుటి : 2 సంచిక : 145 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ బుధవారం 09 ఏప్రిల్ 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు
VOLUME : 02 ISSUE : 145 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Wednesday 09 April 2025 PAGES : 8 PRICE : 3/-

## అమరావతిలో చంద్రబాబు ఇంటి నిర్మాణానికి నేడు శంకుస్థాపన



(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 2)

ఏపీ రాజధాని అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సొంతిల్లు నిర్మించుకోనున్నారు. రేపు (ఏప్రిల్ 9) శంకుస్థాపన జరగనుంది. రాజధాని ప్రాంతంలో సీఎం చంద్రబాబు నివాసం ఏర్పాటు చేసుకోవడం పట్ల ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. కేంద్ర నిధులు, ప్రముఖ సంస్థల ఏర్పాటు, వేగంగా జరుగుతున్న నిర్మాణ పనులతో అమరావతి ప్రాంతంలో సానుకూల వాతావరణం నెలకొంది. చంద్రబాబు నివాస పనులతో అమరావతికి కొత్త శోభ వస్తుందని ప్రజలు భావిస్తున్నారు. మిగతా 2లో

## 15 నుంచి ఏపీలో ఇంటింటికీ 'మన మిత్ర' కార్యక్రమం

(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 2)




ఇంటింటికీ 'మనమిత్ర' కార్యక్రమాన్ని ఈ నెల 15 నుంచి అమలు చేయనున్నట్లు ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది. వాట్సప్ గవర్నెన్స్‌పై సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించనున్నారు. ప్రతి పౌరుడి ఫోన్‌లో 95523-00009 నంబర్‌ను సచివాలయ సిబ్బంది సేవ్ చేయనున్నారు. జిల్లా కలెక్టర్‌కు కార్యక్రమ పర్యవేక్షణ బాధ్యతను ప్రభుత్వం అప్పగించింది. ప్రజలకు అవగాహన పెంచేలా ప్రత్యేక కరపత్రం, వీడియో సందేశాన్ని విడుదల చేసింది. తద్వారా ప్రతి ఒక్కరూ వాట్సప్ గవర్నెన్స్ ఉపయోగించుకునేలా ఐటీ, రియల్ టైం గవర్నెన్స్ శాఖ ఏర్పాట్లను పూర్తి చేసింది.

ప్రస్తుతం వాట్సప్ గవర్నెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం 250కి పైగా సేవలందిస్తోంది. జూన్ నెలకు 500కు పైగా సేవలందించే దిశగా చర్యలు చేపట్టింది. తదుపరి దశలో 1000కిపైగా సేవల కల్పించాలన్నది ప్రభుత్వ అంతిమ లక్ష్యంగా అధికారులు స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా వాట్సప్ గవర్నెన్స్‌ను ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ అందుబాటులోకి తెచ్చారు. మనమిత్ర ఇప్పటికే ప్రజాభిమానం చూరగొంటుందని అధికారులు తెలిపారు. నిరక్షరాస్యుల కోసం వాయిస్ మెసేజ్ ద్వారా పనిచేసేలా ఏఐ ఆధారిత చాట్‌బాట్ ఏర్పాటు చేశారు. పౌరులందరూ తమ మొబైల్ ఫోనులో మనమిత్ర పేరిట 9552300009 నంబరును సేవ్ చేసుకోవాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

## ఆధార్ బయోమెట్రిక్ వ్యవస్థనే ఏమార్చుతున్న హైటెక్ ముఠా గుట్టురట్టు

ఆధార్ బయోమెట్రిక్ వివరాల తారుమారు
12 రాష్ట్రాల్లో నెట్ వర్క్
నిందితులను అరెస్ట్ చేసిన యూపీ పోలీసులు

(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 2)




ఆధార్ కార్డుదారుల బయోమెట్రిక్ వివరాలను తారుమారు చేస్తున్న హైటెక్ ముఠాను ఉత్తరప్రదేశ్ పోలీసులు పట్టుకున్నారు. ఈ ముఠా 12 రాష్ట్రాల్లోని 1,500 మందికి పైగా ఆధార్ కార్డుల బయోమెట్రిక్ డేటాను తారుమారు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.సంభాల్ ఎస్పీ కృష్ణ కుమార్ బిష్ణోయ్, ఏఎస్పీ అనుకృతి శర్మ ఆధ్వర్యంలో సైబర్ టీమ్ సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించి నలుగురు కీలక నిందితులను అరెస్టు చేసింది. నిందితులు యూఐడీఏఐ వ్యవస్థలోని లొసుగులను ఉపయోగించుకుని అక్రమంగా వివరాలు మార్చేందుకు ఏజెంట్ల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నారని పోలీసులు తెలిపారు.బదాయూన్‌కు చెందిన ఆశిష్ కుమార్, ధర్మేందర్ సింగ్, రౌనక్ పాల్, అమ్రోహాకు చెందిన కాసిం హుస్సేన్‌లను అరెస్టు చేశారు. వీరంతా 20 ఏళ్ల వయస్సు వారేనని పోలీసులు తెలిపారు. నిందితులపై ఆధార్ చట్టం, ఐటీ చట్టం 2016, పాస్‌పోర్ట్ చట్టం 1967లోని సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.ఈ ముఠా ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పంజాబ్, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ వంటి రాష్ట్రాల్లో 200 నుంచి 300 మంది రిటైలర్లతో ఒక నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసింది. ఈ ఏజెంట్లు ఆధార్ కార్డులో పేరు, చిరునామా, పుట్టిన తేదీ లేదా మొబైల్ నంబర్ వంటి వివరాలను అక్రమంగా మార్చాలనుకునే వారి నుంచి పత్రాలను సేకరించి... ఒక్కొక్కరి మిగతా 2లో

## ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, జగన్ లకు కృతజ్ఞతలు

సింగపూర్ లో అగ్నిప్రమాదం
గాయపడిన పవన్ తనయుడు
మార్క్ శంకర్ కు ఆసుపత్రిలో చికిత్స
పవన్ కు సానుభూతి తెలిపిన నేతలు
అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపిన పవన్ కల్యాణ్

(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 2)

సింగపూర్ లోని రివర్ వ్యాలీ రోడ్ లో ఉన్న ఓ భవనంలో జరిగిన అగ్నిప్రమాదంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ గాయపడ్డాడు. దాంతో ప్రధాని నరేంద్రమోదీ, ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్, ఏపీ సీఎం చంద్రబాబు, వైసీపీ అధినేత జగన్ తదితరులు పవన్ కల్యాణ్ కు సానుభూతి తెలిపారు. వారందరికీ పవన్ కల్యాణ్ సోషల్ మీడియా వేదికగా కృతజ్ఞతలు తెలిపారు. "ఈ కష్టకాలంలో ఎంతో దయతో స్పందించి, మిగతా 2లో



## రచ్చకెక్కిన టీఎంసీ ఎంపీల విభేదాలు...

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ, ఏప్రిల్ 2)



తృణమూల్ కాంగ్రెస్‌లోని అంతర్గత పోరు రచ్చకెక్కింది. లీకైన వీడియోలు, వాట్సప్ చాట్‌లను భాజపాషేర్ చేయడంతో నేతల మధ్య ఘర్షణ బయటకు వచ్చింది. కమలం పార్టీ ఐటీ సెల్ ఇంఛార్జి అమిత్ మాలవీయ వాటిని షేర్ చేశారు. ఎన్నికల సంఘం కేంద్రకార్యాలయం వద్ద సీనియర్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ, మరో ఎంపీ మధ్య ఈ గొడవ జరిగినట్లు వెల్లడవుతోంది.మాలవీయ పేర్కొన్న దాని ప్రకారం.. ఒక ప్రజెంటేషన్‌ను సమర్పించడానికి తృణమూల్ కాంగ్రెస్ ప్రతినిధుల బృందం ఈసీ కార్యాలయానికి వెళ్లింది. ఈసీ ఆఫీస్‌కు వెళ్లడానికి ముందు వినతిపత్రంపై సంతకాలు చేసేందుకు ఒకసారి సమావేశం కావాలని పార్టీ ఆదేశాలు ఇచ్చింది. కానీ ఆ ఎంపీ ఆ సమావేశానికి రాకుండా నేరుగా ఈసీ వద్దకు వెళ్లారు. ఇది ఇద్దరు ఎంపీల మధ్య గొడవకు దారితీసింది. ఆ ఘర్షణను ఆపేందుకు పోలీసులు జోక్యం చేసుకోవాలని పిలిచేవరకు వెళ్లింది. భాజపా షేర్ చేసిన వీడియోలో.. కల్యాణ్ బెనర్జీ మరో ఎంపీపై ఆగ్రహంతో ఊగిపోతున్నట్లుగా ఉంది. "ఇదంతా పబ్లిక్ ప్లేస్. కాస్త సంయమనం పాటించండి" అని అక్కడున్న టీఎంసీ నేత డెరెక్ ఓబ్రిన్ సర్దిచెప్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది.మీడియాలో ప్రసారమవుతుందని వారించినా ఆయన వినలేదు. ఈ వ్యవహారం తర్వాత పార్లమెంట్ సభ్యులు బెనర్జీ, కీర్తి ఆజాద్ చాటింగ్ చేసుకున్నారు. ఇక మాలవీయ షేర్ చేసిన చాట్ ప్రకారం.. 'ఏఐటీసీ ఎంపీ 2024' పేరిట ఉన్న వాట్సప్ గ్రూప్‌లో కల్యాణ్ బెనర్జీ, కీర్తి ఆజాద్ మధ్య వాగ్వాదం నడిచింది. వారి చాటింగ్‌లో ఒక మహిళ ప్రస్తావన కూడా వచ్చింది. సీనియర్ ఎంపీ ప్రవర్తన కారణంగా పార్లమెంట్ మహిళా సభ్యురాలు ఆ గ్రూప్ నుంచి ఎగ్జిట్ అయినట్లు తెలుస్తోంది.ఈ వ్యవహారంపై టీఎంసీ నేత సౌగతారాయ్ స్పందించారు. " ఇలాంటివి జరిగిఉండాల్సింది కాదు. ప్రతిపార్టీ అంతర్గత గోప్యతను కాపాడుకోవాలి. ఈ గొడవ జరిగినప్పుడు నేను అక్కడ లేను. కానీ మహువా కన్నీళ్లు పెట్టుకోవడం చూశాను. కల్యాణ్ ప్రవర్తనపై పార్టీలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతోంది" అని రాయ్ వెల్లడించారు. కల్యాణ్‌తో జరిగిన వాగ్వాదంలో ఉన్న మరో ఎంపీ మహువా మొయిత్రా అని తెలుస్తోంది. ఈ మొత్తం ఎపిసోడ్, ఈ లీక్స్‌పై టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ తీవ్రంగా కలత చెందారని, వ్యక్తిగతంగా ఈ అంశాన్ని పరిశీలిస్తున్నారని తెలుస్తోంది. దీనికి సంబంధించి మీడియాలో ఎలాంటి ప్రకటనలు చేయొద్దని నేతలకు ఆదేశాలు అందాయి. ఇదిలా ఉంటే.. వాట్సప్ చాట్‌లలో పేర్కొన్న మహిళ మిగతా 2లో

## డ్యామేజ్ అయిన జగన్ హెలికాప్టర్... రోడ్డు మార్గంలో బెంగళూరుకు పయనం

ఈరోజు రాప్తాడులో పర్యటించిన జగన్
హెలికాప్టర్ పైకి దూసుకెళ్లిన వైసీపీ కార్యకర్తలు
స్వల్పంగా దెబ్బతిన్న హెలికాప్టర్

(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 2)




వైసీపీ అధినేత జగన్ ఈరోజు ఉమ్మడి అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గంలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఇటీవల హత్యకు గురైన లింగమయ్య కుటుంబాన్ని జగన్ పరామర్శించారు.

మరోవైపు, జగన్ వచ్చిన హెలికాప్టర్ డ్యామేజ్ అయింది. జగన్ కు స్వాగతం పలికేందుకు పెద్ద ఎత్తున వైసీపీ కార్యకర్తలు హెలిప్యాడ్ వద్దకు వచ్చారు. హెలిప్యాడ్ వద్ద హెలికాప్టర్ ల్యాండ్ కాగానే దాని మీదకు వైసీపీ కార్యకర్తలు దూసుకుపోయారు. దీంతో, హెలికాప్టర్ స్వల్పంగా దెబ్బతింది. ఈ నేపథ్యంలో అదే హెలికాప్టర్ లో బెంగళూరుకు వెళ్లడం సురక్షితం కాదని పైలట్లు జగన్ కు చెప్పారు. దీంతో, ఆయన రోడ్డు మార్గంలో బెంగళూరుకు పయనమయ్యారు.

## పవన్‌కు ప్రధాని మోదీ ఫోన్.. కుమారుడి ఆరోగ్యంపై ఆరా

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ, ఏప్రిల్ 2)



ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ ఆరోగ్యంపై ప్రధాని నరేంద్ర మోదీ ఆరా తీశారు. పవన్‌కు ఫోన్ చేసి అతడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సింగపూర్‌లోని ఓ స్కూల్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో మార్క్ శంకర్ గాయపడిన విషయం తెలిసిందే. కాళ్లు, చేతులకు కాలిన గాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే, విశాఖ పర్యటనలో ఉన్న పవన్‌కు ప్రధాని మోదీ ఫోన్ చేసి అతడి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసినట్లు సమాచారం. మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన ప్రధాని.. పవన్‌కు ధైర్యం చెప్పినట్లు తెలిసింది.మరోవైపు, విశాఖ పర్యటన ముగించుకున్న పవన్ కల్యాణ్.. సింగపూర్ బయల్దేరి వెళ్లనున్నారు. చిరంజీవి దంపతులు సైతం సింగపూర్ బయల్దేరి వెళ్తున్నారు. మార్క్ శంకర్‌కు గాయాలైన విషయం తెలియడంతో తెలుగు రాష్ట్రాల సీఎం చంద్రబాబు, రేవంత్ రెడ్డి సహా పలువురు ప్రముఖులు స్పందించారు. పవన్ కుమారుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు.

## వాలంటీర్ వ్యవస్థ గురించి పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు

వాలంటీర్ వ్యవస్థకు సంబంధించి ప్రభుత్వం వద్ద ఒక్క డాక్యుమెంట్ కూడా లేదన్న పవన్
రాష్ట్రంలో వాలంటీర్ వ్యవస్థ ఉన్నట్టు అధికారికంగా ఆధారాలు లేవని వ్యాఖ్య
జీతాలు ఎలా ఇచ్చారో కూడా తెలియడం లేదన్న పవన్

(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 2)

గత వైసీపీ ప్రభుత్వం వాలంటీర్లను దిక్కు తోచని స్థితిలోకి నెట్టివేసిందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. వాలంటీర్లకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకుండా చేశారని చెప్పారు. దాంతో, కేబినెట్ లో మంత్రి నారా లోకేశ్ తో చర్చించే అవకాశం కూడా లేకుండా పోయిందన్నారు. వాలంటీర్లకు గత ప్రభుత్వం జీతాలు ఎలా ఇచ్చిందో కూడా తెలియడం లేదని... జీతాలు ఎలా ఇచ్చారో వాలంటీర్ నాయకులను అడిగి తెలుసుకోవాలని ప్రజలకు సూచించారు. డుంబ్రిగూడ మండలం కురిది మిగతా 2లో

## మొదటి పేజీ తరువాయి

### అమరావతిలో చంద్రబాబు ఇంటి నిర్మాణానికి

# రేపు శంకుస్థాపన

వెలగుపూడి సచివాలయం వెనుక, ఈ9 రహదారి పక్కన కొంత భూమిని కొనుగోలు చేసిన చంద్రబాబు, బుధవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి గృహ నిర్మాణానికి భూమి పూజ చేయనున్నారు. 2014లో రాజధానిగా అమరావతిని ప్రకటించిన తర్వాత, చంద్రబాబు నాయుడు పాలనను ఇక్కడి నుంచే కొనసాగించారు. అయితే, రాజధాని నిర్మాణంపైనే దృష్టి సారించిన ఆయన సొంతిల్లు నిర్మాణం గురించి పెద్దగా పట్టించుకోలేదు. 2024లో మళ్లీ అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, అమరావతిని దేశంలోనే అగ్రగామి రాజధానిగా తీర్చిదిద్దేందుకు కృతనిశ్చయంతో ఉన్నారు. ఈ క్రమంలోనే నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభించి, నిర్మాణాలను వేగవంతం చేశారు. ఇప్పుడు సొంతిల్లు నిర్మాణం చేపట్టడం ద్వారా ప్రజలకు భరోసా కల్పించనున్నారు. చంద్రబాబు సొంతిల్లు కట్టుకుంటుండటంతో రాజధాని రైతుల్లోనూ నమ్మకం పెరిగింది. రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులు గత ప్రభుత్వ హయాంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పుడు చంద్రబాబు స్వయంగా ఇల్లు నిర్మించుకుంటుండడంతో తమకు మంచి రోజులు వస్తాయని ఆశిస్తున్నారు. రాజధాని ఎంపిక నుంచి ఇప్పటివరకు జరిగిన ప్రతి కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యానికి చంద్రబాబు ప్రాధాన్యతనిచ్చారు. అమరావతిపై కుట్రలు జరిగినప్పుడు రాజధాని రైతులకు అండగా నిలిచారు. ఇప్పుడు ఆయన స్వయంగా ఇల్లు నిర్మించడంతో రాజధాని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, జగన్ లకు కృతజ్ఞతలు

మద్దతు ఇచ్చిన ప్రధాని నరేంద్ర మోదీకి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. నా కుమారుడు మార్క్ ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో ఉన్నాడు. అతడి ఆరోగ్యం నిలకడగా ఉంది. క్రమంగా కోలుకుంటున్నాడు. సింగపూర్ లోని భారత దౌత్యకార్యాలయం అందిస్తున్న సహకారం నాకు గొప్ప ధైర్యాన్నిస్తోంది" అని పవన్ వివరించారు. మరో ట్వీట్ లో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. "మీరు ఎంతో సానుభూతితో పంపిన సందేశానికి థాంక్యూ చంద్రబాబు గారూ...! మీ మద్దతుకు, మీ ప్రార్థనలకు ధన్యవాదాలు" అంటూ స్పందించారు. ఈ క్రమంలో వైసీపీ అధినేత జగన్, ఏపీ మంత్రులు నారా లోకేశ్, అనిత, నాదెండ్ల మనోహర్, అచ్చెన్నాయుడు, కందుల దుర్గేశ్, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు... కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, కిషన్ రెడ్డి, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్, తమిళనాడు సీఎం స్టాలిన్ లకు కూడా పవన్ ధన్యవాదాలు తెలియజేశారు.

### ఆధార్ బయోమెట్రిక్ వ్యవస్థనే ఏమార్చుతున్న హైటెక్ ముఠా గుట్టురట్టు

నుంచి రూ.2,000 నుంచి రూ.5,000 వరకు వసూలు చేసేవారు. విచారణలో ఇప్పటివరకు 1,500 ఆధార్ కార్డులను తారుమారు చేసినట్లు గుర్తించామని, పుట్టిన తేదీలు, మొబైల్ నంబర్లను మార్చినట్లు కనీసం 400 పత్రాలు లభ్యమయ్యాయని ఏఎస్పీ శర్మ తెలిపారు. ఈ ముఠా రేషన్ కార్డుల డేటాను కూడా తారుమారు చేయడానికి ప్రయత్నించిందని వెల్లడించారు. నకిలీ బయోమెట్రిక్ యాక్సెస్‌ను ఉపయోగించి పేర్లు, చిరునామాలను మార్చినట్లు గుర్తించామన్నారు.

ఈ ముఠాలోని కీలక నిందితుడు ఆశిష్ కుమార్ బీటెక్ చదువు మధ్యలో ఆపేసి ఈ ముఠాకు నాయకత్వం వహిస్తున్నాడు. ఆశిష్ కుమార్ నకిలీ ఆధార్, పాస్‌పోర్ట్ సేవా పోర్టల్‌లను సృష్టించి వాటి ద్వారా నకిలీ పత్రాలను సృష్టించేవాడు. నిందితులు యూఐడీఏఐ వ్యవస్థలోని లొసుగులను ఉపయోగించి ఆధార్ ఆపరేటర్ల బయోమెట్రిక్‌లను క్లోనింగ్ చేసి, అధునాతన సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి జియో-ఫెన్సింగ్ నిబంధనలను అతిక్రమించేవారు. దీని ద్వారా సులభంగా లాగిన్ అయి బయోమెట్రిక్ డేటాను అప్‌లోడ్ చేసేవారు. కాసిం హుస్సేన్ అనే నిందితుడు వేలిముద్ర స్కానర్‌లను ఏమార్చి సిలికాన్ వేలిముద్రలను ఉపయోగించేవాడు. నిజమైన ఆపరేటర్ల నుంచి, ఆర్థికంగా బలహీనంగా ఉన్న వ్యక్తుల నుంచి వేలిముద్రలు సేకరించి వాటితో నకిలీ వేలిముద్రలు తయారు చేసేవారు. డిసెంబర్ 2024 తర్వాత ధృవీకరణ నిబంధనలు కఠినతరం కావడంతో ఈ ముఠా నకిలీ జనన ధృవీకరణ పత్రాలు, రేషన్ కార్డులను ఉపయోగించి 20కి పైగా నకిలీ పాస్‌పోర్ట్‌లను సృష్టించినట్లు పోలీసులు గుర్తించారు.

# వాలంటీర్ వ్యవస్థ గురించి పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు

గ్రామం రచ్చబండలో పవన్ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. వాలంటీర్ల పేరుతో ప్రభుత్వ ఉద్యోగాలు అని చెప్పి మాయ చేశారని... రూ. 25 వేల కోట్లు దోచేశారని పవన్ మండిపడ్డారు. ప్రజలకు సేవ చేయడానికి వాలంటీర్లను తీసుకుంటున్నామని చెప్పి... పార్టీ కోసం పని చేయించుకున్నారని విమర్శించారు. వాలంటీర్ వ్యవస్థకు సంబంధించిన డాక్యుమెంట్ కానీ, జీవో కానీ ప్రభుత్వం దగ్గర లేదని... రాష్ట్రంలో వాలంటీర్ వ్యవస్థ ఉన్నట్లు అధికారికంగా ఎలాంటి ఆధారాలు లేవని అన్నారు. అందుకే కేబినెట్ లో వాలంటీర్ల గురించి మాట్లాడటానికి ఎలాంటి అవకాశం కనిపించడం లేదని చెప్పారు.

### రచ్చకెక్కిన టీఎంసీ ఎంపీల

# విభేదాలు...

ఎవరో తెలియాల్సి ఉందని మాలవీయ తన పోస్టులో పేర్కొనడం గమనార్హం. ఇదిలా ఉంటే.. వక్ఫ్ బిల్లుపై గతంలో జరిగిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ సమావేశంలో కూడా కల్యాణ్ నిగ్రహాన్ని కోల్పోయిన సంగతి తెలిసిందే. ఆయనకు, భాజపా ఎంపీ అభిజిత్ గంగోపాధ్యాయకు మధ్య వాగ్వాదం జరగ్గా.. తీవ్ర ఆగ్రహానికి గురైన టీఎంసీ ఎంపీ పక్కనే ఉన్న గాజు వాటర్ బాటిల్‌ను పగలగొట్టారు. దీంతో అతడి చేతికి గాయమైంది.

# ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ప్రకాశం జిల్లా అధ్యక్షుడిగా గేరా అజయ్ కుమార్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 8)

ఆంధ్ర ప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (ఎపిటిసిఎ) నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా ఆర్కిడ్స్ హై స్కూల్ కరస్పాండెంట్ గేరా అజయ్ కుమార్ ఎన్నిక అయినట్లు ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ( ఎపిటిసిఎ) రాష్ట్ర నాయకులు, ఎన్నికల పరిశీలకులు మాంటిస్సోరి ప్రకాష్ బాబు ప్రకటించారు. అసోసియేషన్ రాష్ట్ర నాయకులు మరియు ఎన్నికల పరిశీలకులు మంటిస్సోరి ప్రకాష్ బాబు మాట్లాడుతూ జిల్లా కార్యవర్గ అధ్యక్షుని ఎన్నికకు ఏప్రిల్ రెండో తేదీ నుండి ఏప్రిల్ ఆరో తేదీ వరకు నామినేషన్ ప్రక్రియ కొనసాగిందని, ఈ నామినేషన్ ప్రక్రియలో ఆర్కిడ్స్ హై స్కూల్ కరస్పాండెంట్ గేరా అజయ్ కుమార్ ప్రకాశం జిల్లా నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. నూతన అధ్యక్షుడుగా ఎన్నికైన గేరా అజయ్ కుమార్‌కు రాష్ట్ర ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ తరఫున ప్రకాష్‌బాబు అభినందనలు తెలియజేశారు. త్వరలోనే నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరుగుతుందని ఈయన తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఐపిపి కృష్ణ సాయి హై స్కూల్ కరస్పాండెంట్ పిడుగు జాలిరెడ్డి అధ్యక్షత వహించగా పూర్వ జిల్లా అధ్యక్షులు ఆంధ్ర హై స్కూల్ కరస్పాండెంట్ బి శ్రీనివాసరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ప్రకాశం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన గేరా అజయ్ కుమార్ ను జిల్లాలోని పాఠశాలల కరస్పాండెంట్లు, డైరెక్టర్లు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

# ఉలవపాడు సచివాలయం 3లో భూ సమస్యలపై రెవెన్యూ గ్రామ సభ

### 7 అర్జీలు స్వీకరణ తహసీల్దార్ టి శ్రీనివాసులు



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 8)

మండల కేంద్రమైన ఉలవపాడు సచివాలయం 3లో తహసీల్దార్ టి శ్రీనివాసులు అధ్యక్షతనలో మంగళవారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో మాట్లాడుతూ సర్వేలు ఆన్లైన్లో భూ విస్తరణలో తప్పులు ఉన్న, సర్వే నెంబర్లు ఆన్‌లైన్‌లో నమోదు



కాకపోయినా, పాస్ బుక్ లో పాత లబ్ధిదారుల పేర్లు ఉండి కొత్త వాళ్ల పేర్లు నమోదు కాకపోయినా భూమికి సంబంధించిన సమస్యలు ఏమైనా ఉంటే ఈ గ్రామ సభలో అర్జీలు పెట్టుకోవచ్చని ఆయన తెలియజేశారు. తద్వారా 7 అర్జీలు స్వీకరించబడ్డాయి. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ టి శ్రీనివాసులు, 3వ సచివాలయం వీఆర్వో డానియేలు, వీఆర్వో పేరయ్య, సచివాలయ సిబ్బంది, రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో వాసవి లెవెన్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు





(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 8)

పొదిలి పట్టణంలో వేణుగోపాల స్వామి దేవస్థానం వద్ద ఉన్న ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం వాసవి లెవెన్ ఫ్రెండ్స్ విశేష ఆకు పూజలు నిర్వహించారు. రూ.2 లక్షల నిధులతో నూతన పై కప్పు నిర్మాణం చేశారు. ఆలయానికి రంగులు వేసి సుందరంగా తీర్చి దిద్దారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు గునుపూడి చెంచు సుబ్బారావు (జి.సి) శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వాసవి లెవెన్ ఫ్రెండ్స్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం స్వామి వారికి సామూహికంగా విశేష కుంకుమ పూజలు చేశారు. పూజ అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి లెవెన్ ఫ్రెండ్స్ సభ్యులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.









షణ్ముఖ
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక
ప్రకాశం

# పి- 4తోనే పేదరిక నిర్మూలన సాధ్యం



**సీఎం చంద్రబాబు తన విజన్‌తో**
**రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్నారు**
**దేశంలోనే పెద్ద మొత్తంలో సామాజిక భద్రత పింఛన్లు ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీనే**
**రాష్ట్ర అభివృద్ధికి సహకరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు**
**డెహ్రాడూన్‌లో జరిగిన చింతన్ శివిర్ సమావేశంలో**
**మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 8)**

పి 4 తోనే పేదరిక నిర్మూలన సాధ్యమని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన విజన్‌తో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించేందుకు కృషి చేస్తున్నట్టు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి వీరేంద్ర కుమార్ అధ్యక్షతన అన్ని రాష్ట్రాల సాంఘిక సంక్షేమ శాఖ మంత్రులతో ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్ లో రెండు రోజుల పాటు చింతన్ శివిర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి రెండో రోజు (తరువాయి 4లో...)



# ఛార్లెట్‌లో ఘనంగా టిడిపి ఎమ్మెల్యేల మీట్ అంట్ గ్రీట్

**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం డివిజన్ ఇన్‌ఛార్జి, ఏప్రిల్ 8)**

ఛార్లెట్‌లో ఎన్నారై టీడిపి నాయకులు తెలుగు దేశం పార్టీ ఎమ్మెల్యేలు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌తో మంగళవారం ఏర్పాటు చేసిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమం విజయవంతమైంది. ఈ కార్యక్రమంలోనే పార్టీ 43వ ఆవిర్భావదినోత్సవ వేడుకలను కూడా నిర్వహించారు. వర్కింగ్ డే అయినప్పటికీ దాదాపు రెండు వందల మంది ఛార్లెట్ ఎన్నారైలు పాల్గొన్నారు. చార్లెట్‌లోని వెడ్డింగ్టన్ రోడ్డులో ఉన్న బావార్చి ఇండియన్ గ్రిల్ రెస్టారెంట్ లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు కందుల నారాయణ రెడ్డి, కూన రవికుమార్ మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీని అప్పటి కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఎన్టీరామారావు స్థాపించారని, సినిమా నటుడి పార్టీ అన్నవారే చివరకు ఈ పార్టీలో చేరి అధికారాన్ని అందుకున్నారని చెప్పారు. ఈరోజు అమెరికాలో ఇన్ని లక్షల మంది తెలుగువాళ్ళు ఐటీ రంగంలో ముందున్నారంటే అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే కారణమని చెప్పారు.




4

# ఐ కాన్ స్టార్ అల్లు అర్జున్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎంఎన్ రెడ్డి



**(షణ్ముఖ వెలుగు, హైదరాబాద్, ఏప్రిల్ 8)**

ఐ కాన్ స్టార్, స్టైలిష్ స్టార్, జాతీయ ఉత్తమ నటుడు అవార్డు గ్రహీత అల్లు అర్జున్ ను మంగళవారం హైదరాబాదులోని ఆయన నివాసంలో సినీ నటుడు, మాజీ డిఆర్‌యుసిసి మెంబర్ ఎమ్ ఎన్ రెడ్డి (ముమ్మిడి నరసింహారెడ్డి) అల్లు అర్జున్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎన్ రెడ్డి అల్లు అర్జున్‌తో మాట్లాడుతూ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. తన నటనతో ప్రేక్షకులను అలరిస్తున్న అల్లు అర్జున్ భవిష్యత్తులో నెంబర్ వన్ స్టార్‌గా ఎదగాలని ఆకాంక్షించారు. తెలుగు చలనచిత్రానికి ముఖ చిత్రంలా రూపుదిద్దుకోవాలని అన్నారు. అల్లు అర్జున్‌ను కలిసిన వారిలో రాఘవరెడ్డి, సత్యనారాయణరెడ్డి, ఎర్రగొల్ల రాజు, అల్లు అర్జున్ అభిమానులు ఉన్నారు.



# మంత్రి గొట్టిపాటితో ఇంటర్నేషనల్ హైడ్రో అసోసియేషన్ ప్రతినిధుల భేటీ

**పీఎస్పీల ఏర్పాటు, నిర్వహణ, అమలు తీరుపై చర్చించిన ఐహెచ్‌ఏ ప్రతినిధులు**
**పునరుత్పాదక విద్యుత్ యూనిట్లకు సింగిల్ విండో అనుమతులు**
**మంత్రి గొట్టిపాటి రవి కుమార్**

**(షణ్ముఖ వెలుగు, అద్దంకి, ఏప్రిల్ 8)**


పునరుత్పాదక విద్యుత్ రంగానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించి ప్రాజెక్టుల నిర్మాణాలకు సింగిల్ విండో విధానం ద్వారా త్వరితగతిన అనుమతులు మంజూరు చేస్తున్నామని పేర్కొన్నారు. అమరావతి లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం నాడు ఇంటర్నేషనల్ హైడ్రో అసోసియేషన్ (ఐహెచ్‌ఏ) ప్రతినిధులు మంత్రి గొట్టిపాటితో భేటీ అయ్యారు. ఈ క్రమంలో ఐహెచ్‌ఏ ప్రతినిధులతో మాట్లాడిన మంత్రి రాష్ట్రంలో పీఎస్పీల నిర్మాణం, నిర్వహణ, అమలుపై చర్చించారు. రాష్ట్రంలోని యాగంటి, రాజుపాలెం, గడికోట, అరవేటిపల్లి, దిన్నేపల్లి ప్రాంతాల్లో సుమారు 5000 మెగావాట్లతో ఏర్పాటు చేయబోయే పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు సంబంధించిన వివరాలను మంత్రి గొట్టిపాటి ఐహెచ్‌ఏ ప్రతినిధులకు తెలియజేశారు. అదే విధంగా రాష్ట్రంలో ప్రాజెక్టులు ఏర్పాటు చేసే వారికి సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చేస్తున్నామని, పెట్టుబడిదారులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. పునరుత్పాదక విద్యుత్ రంగంలో దేశంలోనే నెంబర్ వన్ గా ఆంధ్రప్రదేశ్ ను నిలిపేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే పీఎస్పీల ఏర్పాటుకూ పూర్తి స్థాయి ప్రోత్సాహం అందిస్తున్నట్లు మంత్రి గొట్టిపాటి వెల్లడిం చారు. ప్రపంచవ్యాప్తంగా సుమారు 50కి పైగా దేశాల్లో పీఎస్పీల ఏర్పాటు, నిర్వహణకు సంబంధించి ఐహెచ్‌ఏ ఎంతో కీలకంగా వ్యవహరిస్తోందని ఆ సంస్థ ప్రతినిధులు మంత్రి గొట్టిపాటికి వివరించారు. పీఎస్పీల నిర్వహణలో ఐహెచ్‌ఏ కీలకంగా వ్యవహరిస్తుందని తెలపారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయబోయే పీఎస్పీలకు పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తామని ఐహెచ్‌ఏ ప్రతినిధులు పేర్కొన్నారు.



# కనిగిరిలో నవోదయ స్కూలు ఏర్పాటుకు లోకేష్‌ను కోరిన మాగుంట

**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, ఏప్రిల్ 8)**

ఉండవల్లిలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపి మాగుంట ఒంగోలు పార్లమెంటు పరిధిలోని కనిగిరి నియోజకవర్గ కేంద్రంలో నవోదయ స్కూలును ఏర్పాటు చేయవలసినదిగా కోరారు. కనిగిరి ప్రాంతం బాగా వెనుకబడిన ప్రాంతమని, అధిక శాతం ప్రజలు వ్యవసాయం, వ్యయసాయ కూలీ పనులపై అదారపడినందున కార్పోరేట్ స్కూళ్ళలో చదివించలేక ఇబ్బంది పడుచున్నారని, కావున కనిగిరిలో నవోదయ స్కూలును ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఒంగోలులోని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో మౌలిక వసతులులేక విద్యార్థులు, ఉపాధ్యాయులు చాలా ఇబ్బంది పడుచున్నారన్నారు. అన్ని వసతుల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయవలసినదిగా కోరారు. మంత్రి నారా లోకేష్ సానుకూలంగా స్పందించి, త్వరలోనే కేంద్రంతో సంప్రదించి కనిగిరిలో నవోదయ స్కూలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని, ఒంగోలులోని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయానికి కూడా నిధులు మంజూరు చేస్తానని తెలిపారు.





# ఛార్లెట్‌లో ఘనంగా టిడిపి ఎమ్మెల్యేల మీట్ అంట్ గ్రీట్

ఆయన విజనరీ ఏ రాజకీయవేత్తకి లేదని ఆయన తన ప్రసంగంలో ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్‌లో మళ్ళీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రాన్ని మళ్లీ ప్రగతిపథంలో నడిపించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని, ఆయనకు ఎన్నారైలు మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఎన్నికల సమయంలో పార్టీని గెలిపించేందుకు ముందుకువచ్చినట్లే రాష్ట్రాన్ని మళ్లీ ప్రగతిబాటలో పయ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రగతికోసం పెట్టుబడులు పెట్టేందుకు ముందుకురావాలని కోరారు. చంద్రబాబు చేస్తున్న పనులకు, పథకాలను మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఛార్లెట్ ఎన్నారై టీడీపీ స్థానిక నాయకులు నాగ పంచుమర్తి, ఠాగూర్ మల్లినేని, రమేష్ ముకుళ్ళ, సతీష్ నాగభైరవ, రాజేష్ వెలమల మరియు ఇతర ఎన్నారై టీడీపీ కార్యవర్గ సభ్యులు సమన్వయపరచారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై టీడిపితోపాటు, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయంతం చేసిన వారికి నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు.





# పి- 4తోనే పేదరిక నిర్మూలన సాధ్యం

సమావేశంలో రాష్ట్రంలో అమలు చేస్తున్న పి4 పై ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ ప్రజెంటేషన్‌ని ఇతర రాష్ట్రాల మంత్రులు, అధికారులు ఆసక్తిగా తిలకించారు. ప్రజెంటేషన్ అనంతరం మంత్రి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు తన విజన్‌తో ఏపీలో పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్నారు. విజన్ 2047లో భాగంగా ఉగాది నాడు పి4 పథకం ప్రారంభించి పేదలను ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టారు. సమాజంలో 10 శాతం ఉన్న ధనవంతులు 20 ఉన్న పేదల అభివృద్ధికి సహకరించాలి. రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు ప్రత్యేకంగా ఈగల్ వ్యవస్థ తీసుకొచ్చి ఈగల్ పోలీసు స్టేషన్లు ఏర్పాటు చేశాం. జిల్లా ఆస్పత్రులు, మెడికల్ కాలేజీల్లో డి ఎడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేసి సమర్థవంతంగా నిర్వహిస్తున్నాం. దేశంలోనే పెద్ద మొత్తంలో సామాజిక భద్రత పింఛన్‌లు ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీనే. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఏపీలో వృద్ధులకు రూ. 4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేల నుంచి రూ.15 వేలు ఫించన్ అందిస్తున్నాం. పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల అనుసంధా నంతో పారిశుధ్య నిర్వహణను మిషన్ల ద్వారా నిర్వహించేందుకు కృషి చేస్తున్నాం. ఇళ్ల నిర్మాణం కోసం కేంద్రం పీఎంఏవై కింద ఇచ్చే దానికి అదనంగా ఎస్టీలకు రూ. 75 వేలు, ఎస్సిలకు రూ. 50 వేలు ఏపీలో కూటమి ప్రభుత్వం ఇస్తోంది. పీఎం ఆదర్శ గ్రామ యోజన కింద కేంద్ర ప్రభుత్వం గ్రామానికి ఇస్తున్న రూ. 21 లక్షల్ని రూ.75 లక్షలు పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నా. పుట్టుకతోనే పిల్లల్లో ఆటిజం, వినికిడి లోపాలు గుర్తించేందుకు ప్రత్యేక పరికరాల్ని ప్రతి మెడికల్ కాలేజీల్లో ఏర్పాటు చేసేందుకు కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ సహకారం తీసుకోవాలి. వృద్దులకు, ట్రాన్స్ జెండర్లకు గుర్తింపు కార్డులు ఇస్తున్నాం. వృద్ధుల కోసం అన్ని జిల్లాల్లో వృద్ధాశ్రమాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. రూ. 143 కోట్లతో సంక్షేమ వసతి గృహాల్లో మరమ్మతులు చేయిస్తున్నామని, ఎస్సి కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి స్వామి అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధికి సహకరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి మంత్రి డోలా ధన్యవాదాలు తెలిపారు.

# పెంచిన వంట గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలి

## ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి డిమాండ్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 8)

ధరల భారాలు తగ్గిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన పాలకులు ప్రజల మీద మోయలేని భారాలు మోపటం దుర్మార్గమని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి అన్నారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కమిటీ సమావేశం స్థానిక ఎల్బీజీ భవన్ లో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరను వెంటనే ఉపసంహరించుకోవాలి డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక సంపన్నులకు వరాలు ప్రకటిస్తూ, సామాన్యులపై భారాలు మోపుతుందని విమర్శించారు. మోడీ అధికారంలోకి వచ్చేనాటికి 450 రూపాయలు ఉన్న గ్యాస్ బండధర ఇప్పుడు 900 చేరిందని ఆ గ్రహం వ్యక్తం చేశారు. తామాధికారంలోకి వస్తే ధరలు తగ్గిస్తా నని చెప్పి, నేడు నిత్యం భారాలు మోపుతున్న మోడి మాటలకి చేతలకి పొంతన లేకుండా పోయిందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా క్రూడ్ ఆయిల్ ధరలు 40 శాతం పడిపోతా ఉంటే మన దేశంలో మాత్రం పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను ప్రభుత్వాలు పెంచుకుంటూ పోతున్నాయని అన్నారు. ఎవరి ప్రయోజనాలు కాపాడటానికి ఈ ధరలు పెంచుతున్నారని ఆమె ప్రశ్నించారు. నిత్యం పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలతో సామాన్య ప్రజలు సతమతమవుతుంటే, విద్యుత్ సంస్కరణలతో ఛార్జీల భారాలు మోపటం దుర్మార్గమని అన్నారు. ప్రజానీకానికి ఉపశమనం కలిగించాల్సినటువంటి ప్రభుత్వాలు భారాలేసేందుకు పూనుకోవటం సిగ్గుచేటని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అచ్చా దినాలు తీసుకొస్తానంటుంటే, రాష్ట్రంలో ప్రభుత్వం పిఫోర్ విధానాన్ని తీసుకొస్తానని చెబుతూ పోటీలు పడి ప్రజల మీద భారాలు వేయటం సరికాదని అన్నారు. ఈ పెంచిన గ్యాస్ ధర వెంటనే తగ్గించాలని, లేకపోతే మహిళల ఆగ్రహానికి ప్రభుత్వాలు గురికాక తప్పదని అన్నారు. ఐద్వా ఆధ్వర్యంలో గ్యాస్ ధరల భారాలకు వ్యతిరేకంగా మహిళలు నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి జి ఆదిలక్ష్మి అధ్యక్షత వహించారు. సమావేశంలో జిల్లా నాయకులు యన్ మాలతి, ఎస్‌కె నాగూర్ బి, కే రాజేశ్వరి, కే లక్ష్మీప్రసన్న, బి రాజ్యలక్ష్మి, బి పద్మ, పాల్గొన్నారు.

# క్విస్ ఫ్యాకల్టీ దాయనేని ప్రవీణకు డాక్టరేట్ అభినందించిన యాజమాన్యం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 8)

ఒంగోలు క్విస్ కళాశాల సీఎస్ ఈ డిపార్ట్ మెంట్ కి చెందిన దాయనేని ప్రవీణ డాక్టరేట్ అందుకున్నారు. చెన్నైలోని భారత్ విశ్వవిద్యాలయం నుంచి ఆమె డాక్టరేట్ పొందారు. డేటా సైన్స్ ఎనాలసిస్ యూజింగ్ డీప్ లెర్నింగ్ టెక్నిక్స్ ఇన్ మైనింగ్ బయలాజికల్ డేటా అంశంలో ఆమె పరిశోధన చేశారు. భారత్ యూనివర్సిటీ సీఎస్ ఈ డిపార్ట్‌మెంట్‌కి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ శివరామన్ గైడెన్స్‌లో రిసెర్చ్ చేసిన ప్రవీణ పీహెచ్ డీ పట్టా పొందారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణను విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ గాయత్రి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి. హనుమంతరావు, ఐక్యూఏసీ హెడ్ డాక్టర్ ప్రశాంత్, సీఎస్ ఈ డిపార్ట్ మెంట్ హెచ్ వోడీ డాక్టర్ బుజ్జిబాబు పాల్గొన్నారు. పీహెచ్ డీ చేసేందుకు సహకరించిన కాలేజి యాజమాన్యానికి ప్రవీణ ధన్యవాదాలు తెలిపారు.

# 11 అంకెల విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలి

## మండల వ్యవసాయ అధికారి కే బుజ్జి బాయి

(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, ఏప్రిల్ 8)


మండలంలోని వ్యవసాయ అధికారిణి చెట్లమిట్ట, వైడిపాడుకి సందర్శించారు. చెట్లమిట్ట, వైడిపాడులో రైతు విశిష్ట సంఖ్య గురించి తనిఖీ చేసి అక్కడ ఉన్న రైతు సోదరులను ఉద్దేశించి మండల వ్యవసాయ అధికారి కే బుజ్జి బాయి, 11 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య గురించి పలు విషయాలు వివరించారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునీకరణ చేయుటకు కేంద్ర ప్రభుత్వం రైతులకు 11అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య ఆధార్‌కార్డు తరహాలో రైతులకు అందించనుంది. పొలము ఉన్న ప్రతి రైతు కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వివిధ పథకాలు రాయితీలు పొందాలంటే ఈ 11 అంకెల విశిష్ట సంఖ్య నమోదు (ఫార్మర్ రిజిస్ట్రీ) తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు. రాష్ట్రంలోని భూమి గల ప్రతి రైతుకు ఒక ప్రత్యేక రైతు గుర్తింపు సంఖ్యను ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేసి పారదర్శకంగా మరింత అందుబాటులోకి తీసుకొని రావటం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం. ఇది వ్యవసాయం రైతు సంక్షేమ మంత్రిత్వశాఖ, భారత ప్రభుత్వం సమన్వయంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ చేపడుతున్న బృహత్తర కార్యక్రమమన్నారు. పూర్తి వివరాలకు రైతు సేవా కేంద్రంలో ఉన్న గ్రామ సహాయకులను సంప్రదించాల్సిందిగా తెలిపారు. అదే విధంగా ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి, రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



# భగ్గుమంటున్న భానుడు

## విలవిలలాడుతున్న ప్రజలు







**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 8)**
భగభగ మండుతున్న సూర్యుడు తాపానికి ప్రజలు  విలవిలాడుతున్నారు. ఉదయం 8 గంటల నుంచే ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. వివిధ పనులపై రోడ్డుపైకి వెళ్లాలంటే భయపడే పరిస్థితి నగరంలో కనిపిస్తుంది. వాహనదారులు ఎండ వేడికి తట్టుకోలేక నెత్తిన టోపీ, గొడుగులు, వేసుకొని వెళ్లాల్సి వస్తుంది. ఈ సంవత్సరంలో ఎండలు ఎక్కువగా ఉంటాయని వాతావరణం నిపుణులు తెలుపుతున్నారు. అవసరమైతే గానీ తగు జాగ్రత్తతో బయటికి రావాలని ఎండ తీవ్రతకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ నిపుణులు తెలుపుతున్నారు.















## దాయినేని ప్రవీణకు శుభాకాంక్షలు తెలిపిన దాయినేని కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 8)

20 సంవత్సరాలు సుదీర్ఘకాలంలో టీచింగ్లో సైన్స్ ఎనాలసిస్ యూజింగ్ డీప్ లెర్నింగ్ టెక్నిక్స్ ఇన్ మైనింగ్ బయలాజికల్ డేటా అంశంలో డాక్టర్ శివరామన్ గైడ్ షిప్‌లో రిసెర్చ్ చేసి పీహెచ్ డీ పట్టా పొందిన దాయినేని ప్రవీణకు



శుభాకాంక్షలు తెలిపారు దాయినేని కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఓంకార్ రెడ్డి, బెంగళూరు టిసిఎస్ భూపతి నర్సింగ్ నాయుడు, బెంగళూరు ఖజాముద్దీన్, ఒంగోలు ఐవీకే సురేష్, భీమడోలు నల్లూరి ప్రదీప్, ఒంగోలు ఎస్కె బాజీ, తదితరులు ఉన్నారు.

## యధావిధిగా ఎన్టీఆర్ వైద్యసేవలు

### అవాస్తవాలు విని ప్రజలు అధైర్యపడవద్దు

### ప్రకాశం జిల్లా ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా సమన్వయకర్త డాక్టర్ హేమంత్ కుమార్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 8)

ప్రకాశం జిల్లా ఎన్టీఆర్ వైద్యసేవ నెట్వర్క్ హాస్పిల్లో వైద్యసేవలు యధావిధిగా కొనసాగుతున్నాయని ప్రకాశం జిల్లా ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా సమన్వయకర్త డాక్టర్ హేమంత్ కుమార్ తెలిపారు. కొన్ని మీడియా,పత్రికా,సోషల్ మీడియాలలో గడచిన 24 గంటలలో వచ్చిన కథనాలు చూసి లేదా ఎవరైనా తెలిసిన వ్యక్తుల ద్వారా ఎన్టీఆర్ వైద్యసేవ గురించిన అవాస్తవిక సమాచారాన్ని విని ప్రజలు అధైర్య పడాల్సిన పని లేదు. స్వయానా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ముగిసిన ఆంధ్రప్రదేశ్ స్పెషలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ భేటీలో పెండింగ్ బిల్లుల చెల్లింపును గురించి హామీ ఇచ్చారు. కాబట్టి ప్రకాశం జిల్లా ప్రజలందరూ వారి అవసరాన్ని బట్టి యధావిధిగా ఎన్టీఆర్ వైద్యసేవలు ప్రైవేట్ నెట్వర్క్ హాస్పిటల్స్లో ఉచితంగా పొందవచ్చు. ప్రజలు ఎవరైనా ఎన్టీఆర్ వైద్యసేవలు పొందటంలో ఇబ్బంది పడుతుంటే వెంటనే ఆ హాస్పిటల్ వైద్యమిత్ర, టీం లీడర్ లేదా జిల్లా సమన్వయకర్తలకు నేరుగా ఫిర్యాదు చేయవచ్చని డాక్టర్ హేమంత్ కుమార్ సూచించారు.

## పిజిఆర్ఎస్ వినతులు పెండింగ్ లేకుండా చూడాలి

### జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 8)

పిజిఆర్ఎస్ వినతులు పెండింగ్ లేకుండా చూడాలని, అర్జీదారులు పూర్తిస్థాయిలో సంతృప్తి చెందేవిధంగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల కృష్ణ, అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ, రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహశీల్దార్లు, ఆర్ఎస్‌డిటిలు, మండల సర్వేయర్లతో వీడియో కాన్ఫరెన్స్ కాన్ఫరెన్స్ నిర్వహించి రీ సర్వే, నీటిపన్ను, పిజిఆర్ఎస్ గ్రీవెన్స్, 22ఏ పెండింగ్ ధరఖాస్తులు, రెవెన్యూ సదస్సులు, తదితర అంశాలపై మండలాల వారీగా తహశీల్దార్లతో సమీక్షించారు. పిజిఆర్ఎస్ వినతులు పెండింగ్ లేకుండా చూడాలని, అర్జీదారులు పూర్తిస్థాయిలో సంతృప్తి చెందేవిధంగా పరిష్కరించాలని చెప్పారు. రెగ్యులరైజేషన్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీసర్వే ప్రక్రియను తప్పులు దొర్లకుండా, పకడ్బంధీగా నిర్వహించాలని అన్నారు.నీటి పన్ను వసూళ్లపై దృష్టి సారించాలని రెవెన్యూ అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, కలెక్టరేట్ ల్యాండ్ సెక్షన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 7వ పౌష్టికాహార పక్షోత్సవాలు విజయవంతంగా నిర్వహించేలా అధికారులు పనిచేయాలి

## జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 8)

జిల్లాలో ఈ నెల 8 నుంచి 22 వ తేదీ వరకు 15 రోజుల పాటు నిర్వహించనున్న 7వ పౌష్టికాహార పక్షోత్సవాలు (పోషణ్ పఖ్వాడా) విజయవంతంగా నిర్వహించేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్లో జరిగిన 7వ పౌష్టికాహార పక్షోత్సవాలు ప్రారంభ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా పాల్గొని మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీ నుండి 22 వ తేదీ వరకు 15 రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా 7వ పౌష్టికాహార పక్షోత్సవాలు రోజుకు ఒక కార్యక్రమంతో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం మొదటి 1000 రోజుల (గర్భస్త దశ నుండి 2 సంవత్సరాల వరకు సంరక్షణపై శ్రద్ధ వహించుట, లబ్ధిదారులు స్వయంగా తమంతట తామే పోషన్ ట్రాకర్ లో నమోదు చేసుకునే విధానం పట్ల ప్రచారం చేయుట, కమ్యూనిటీ ఆధారిత నిర్వహణ కార్యక్రమం అమలు చేయడం ద్వారా పిల్లలలో పోషకాహార లోపం నివారించడం, పిల్లల్లో ఊబ కాయాన్ని తగ్గించడానికి ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాటు చేసుకునేలా చేయడమని జిల్లా కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా రక్తహీనత కలిగిన కిషోర భాలికల పై, హై రిస్క్ ప్రేగ్నేట్స్, ఉబకాయ పిల్లలు, బరువు తక్కువ పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించి వారికి అవసరమైన పౌష్టికాహారం అందించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయడంతో పాటు పౌష్టికాహారం యొక్క ఆవశ్యకతను ప్రజలకు వివరించడం, అవగాహన కల్పించడం చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. క్షేత్ర స్థాయిలో ఐసిడిఎస్, విద్య, హెల్త్, ఎంపీడిఓలు, మునిసిపల్ కమీష నర్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు సమన్వయంతో పనిచేసి ప్రజలను భాగస్వా ములను చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం అయ్యేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఐసిడిఎస్ పిడి హేన సుజన మాట్లాడుతూ 7వ పౌష్టికాహార పక్షోత్సవాలు ముఖ్య ఉద్దేశ్యంను వివరించారు. తొలుత 7వ పౌష్టికాహార పక్షోత్సవాలు భాగంగా రోజు వారీగా నిర్వహించు కార్యక్రమం వివరాలను సిడిపిఓ మాధవి వివరించారు.

ఈ సందర్భంగా 7వ పౌష్టికాహార పక్షోత్సవాలుకు సంబంధించి ప్రచురించిన గోడ స్టిక్కర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, మెప్మా పీడీ శ్రీహరి, సిడిపిఓలు, సూపర్వైజర్లు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.






# రీసర్వే ప్రక్రియ పటిష్టంగా అమలయ్యేలా చర్యలు

## జిల్లా కలెక్టర్లకు సూచించిన సిసిఎల్ఎ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 8)

రీసర్వే సమస్యలు, సిటిజన్స్ సర్వీసెస్, పిజిఆర్ఎస్ పరిష్కారంపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సిసిఎల్ఎ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి పేర్కొన్నారు. విజయవాడ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి మంగళవారం రెవెన్యూ సదస్సుల పిజిఆర్ఎస్, రీసర్వే, ఐవిఆర్ఎస్ ఫీడ్ బ్యాక్, వాటర్ ట్యాక్స్ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిసిఎల్ఎ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిసిఎల్ఎ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి మాట్లాడుతూ జిల్లాల్లో రీసర్వే ప్రక్రియ పటిష్టంగా అమలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. పిజిఆర్ఎస్ దరఖాస్తులు బియాండ్ ఎస్-ఎల్ఎలోపు వెళ్లకుండా గడువులోపు నాణ్యతగా పరిష్కరించాలని ఆదేశించారు. మూడో కలెక్టర్ల సమావేశంలో రెవెన్యూ సమస్యలు బాగా పరిష్కారం అవ్వాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించారని, అందుకు అనుగుణంగా అధికారులు పనిచేయాలన్నారు. రీసర్వే సమస్యలు, సిటిజన్స్ సర్వీసెస్, పిజిఆర్ఎస్ పరిష్కారంపై దృష్టి పెట్టడం అత్యంత ముఖ్యమైనదని, ఆయా దరఖాస్తులను, సమస్యలను పెండింగ్ లేకుండా సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. గ్రామా స్థాయిలో వాటర్ ట్యాక్స్ వసూలు పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు ఒంగోలు కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారి గౌస్ భాషా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.




# స్కూటీ ఢీ కొట్టిన కారు తండ్రి కొడుకులకు తీవ్ర గాయాలు

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 8)

చాగొల్లు సమీపంలోని నేషనల్ హైవే-16 పై కారు స్కూటీని వెనుక వైపు నుండి ఢీ కొట్టిన ఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఉలవపాడు మండలం చాగొల్లు సమీపంలోని నేషనల్ హైవే-1 6పై మంగళవారం ఉదయం 7 గంటల సమయంలో ఉలవపాడు న్యూ అంబేద్కర్ నగర్ కు చెందిన పెదపూడి అజయ్ కుమార్ తన కుమారుడు పెదపూడి అభిలాష్ కుమార్ ను కావలిలో ఎగ్జామ్ రాయించేందుకు స్కూటీపై తీసుకొని వెళుతుండగా చాగొల్లు నేషనల్ హైవే దగ్గరకు వచ్చేసరికి హైదరాబాదు నుండి నెల్లూరు వెళ్తున్న ఏపీ 26 బీఆర్3005 నెంబర్ గల కారు స్కూటీని వెనుక వైపు నుంచి ఢీకొట్టడంతో స్కూటీపై నుండి తండ్రి కొడుకులు ఇద్దరు ఎగిరి క్రింద పడటంతో ఇద్దరి తలలకు తీవ్ర గాయాలయ్యాయి. వారికి ప్రథమ చికిత్స అందించడం కోసం ఉలవపాడు ప్రభుత్వ ఆసుపత్రి తరలించి చికిత్స చేసి కుమారుడు పరిస్థితి విషమించడంతో 108 ద్వారా ఒంగోలు కిమ్స్ ఆసుపత్రికి తరలించడం జరిగింది. తర్వాత తండ్రిని కూడా మెరుగైన చికిత్స నిమిత్తం మరో 108 వాహనంలో ఒంగోలు కిమ్స్ ఆస్పత్రికి తరలించారు.







# పోలవరం-బనకచర్లతో చంద్రబాబు భగీరథ ప్రయత్నం

## పోలవరం-బనకచర్ల జలహారతి కార్పొరేషన్ ఏర్పాటు పై చీఫ్ విప్ జీవీ హర్షం

**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఏప్రిల్ 8)**

పోలవరం-బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టు రూపంలో ముఖ్యమంత్రి చంద్రబాబు భగీరథ ప్రయత్నానికి శ్రీకారం చుడుతున్నారని, కరవు రహిత ఆంధ్రప్రదేశ్ సాధనలో ఇది తొలి అడుగు అని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. ఆ దిశగా రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసిన జలహారతి కార్పొరేషన్‌తో దశాబ్దాల దాహార్తిని తీర్చే ప్రగతి యజ్ఞానికి నాంది పలికారన్నారు. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు కోసం కంపెనీల చట్టం కింద వందశాతం ప్రత్యేక వాహక సంస్థగా జలహారతి కార్పొరేషన్‌పై ఏర్పాటుపై మంగళవారం ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో స్పందించారు చీఫ్ విప్ జీవీ ఆంజనేయ్ళు. పల్నాడు, ప్రకాశం, రాయలసీమ ప్రాంతాల్లో తరతరాలుగా పీడిస్తోన్న కరవును తీర్చే బృహత్తర ప్రాజెక్టుగా పోలవరం-బనకచర్ల అనుసంధానం రూపుదిద్దుకుంటోందన్నారు. అలాంటి గొప్ప లక్ష్యం సాధన కోసం జలహారతి కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు పల్నాడు ప్రజల తరఫున హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నా అన్నారు. పోలవరం-బనకచర్ల లింక్‌లో భాగంగా బొల్లాపల్లి వద్ద బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణం చేపడతారని, దానిద్వారా తమ ప్రాంతంలో సాగునీరు, తాగునీరు సమస్యల నుంచి విముక్తి లభించడంతో పాటు భూగర్భజలాలు కూడా భారీగా పెరుగుతాయని హర్షం వ్యక్తం చేశారు. అటు గోదావరి, ఇటు కృష్ణా నదుల జలాలతో రెండు పంటలు పండించుకుంటూ పల్నాడు ప్రాంతం పచ్చతోరణంగా మారనుందన్నా రు. ఇవే అంశాల్లో అయిదేళ్ల వైకాపా పాలనలో పల్నాడు, వినుకొండ ప్రాంతాలు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పల్నాడు దాహార్తిని తీర్చే ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించిందని, రూ.80 వేల కోట్లకు పైగా వ్యయంతో చేపట్టబోయే పోలవరం- బనకచర్ల భారీ ప్రాజెక్టు పూర్తయితే, కరవు ప్రాంతాలైన పల్నాడు, ప్రకాశం, రాయలసీమలకు నీటి సమస్య శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ రూపంలవో రాష్ట్ర ప్రజల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి కోసం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చొరవకు పల్నాడు ప్రజలు ఎల్లవేళలా రుణపడి ఉంటారన్నారు.





# పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలి

## సిపిఐ కందుకూరు నియోజకవర్గ కార్యదర్శి బి సురేష్ బాబు

**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఏప్రిల్ 8)**

కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ పై ఎక్స్ఛేంజ్ సుంకమును రూ.2లను పెంచడానికి కమ్యూనిస్టు పార్టీగా తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని సిపిఐ కందుకూరు నియోజకవర్గ కార్యదర్శి బి సురేష్ బాబు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ పై ఎక్సైజ్ సుంకాలను పెంచడం పట్ల మండిపడ్డాడు. మోడీ హయాంలో 2014 పోల్చుకుంటే అంతర్జాతీయ మార్కెట్లో ఆయిల్ ధరలు 41 శాతం తగ్గాయి ఇలాంటి తరుణంలో కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించడానికి బదులు రెండు రూపాయలు చొప్పున ఎక్స్ఛేంజ్ సుంకాన్ని పెంచింది టారిఫ్ విధానంపై కుంభ కర్ణుడిలా నిద్రపోవడం వల్ల స్టాక్ మార్కెట్లో చిన్న, పెద్ద ఇన్వెస్టర్లు 19 లక్షల కోట్లు నష్టపోయినా సంతృప్తి చెందక కేంద్ర ప్రభుత్వం గాయాలపై కారం పూసిందని ఆయన మండిపడ్డారు. 2020లో పెట్రోల్ 13 రూపాయలు డీజిల్ 16 రూపాయలు మేర పెంచి ప్రజలపై అధిక భారాల మోపుతుందని ఇప్పటికే అధిక ధరలతో ఉన్న డీజిల్ పెట్రోల్ ధరలు మరలా రెండు రూపాయల పెంచడం పేద ప్రజల వాహనదారులు ఇబ్బందులు గురవుతారని వెంటనే పెంచిన పెట్రోల్ డీల్ దాన్ని తగ్గించాలని అన్న కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# 7 మంది పేకాట రాయుళ్లు అరెస్ట్

## రూ.69,120 నగదు, రెండు బైకులు స్వాధీనం

**(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, ఏప్రిల్ 8)**

మండలంలోని గుండంచర్ల గ్రామం శివారులో పేకాట ఆడుతున్నట్లు పెద్దారవీడు ఎస్సై పి.అనిల్ కుమార్‌కు రాబడిన విశ్వసనీయమైన సమాచారం మేరకు, యర్రగొండపాలెం సిఐ సిహెచ్ ప్రభాకర్ రావు, పెద్దారవీడు ఎస్సై పి.అనిల్ కుమార్, ఎస్‌బి ఏఎస్ఐ మాల్యాద్రి, పెద్దారవీడు పోలీస్ స్టేషన్ సిబ్బందితో కలిసి రైడ్ చేసి 7 మంది పేకాట జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.69,120ల నగదు, బైకులు స్వాధీన పరుచుకుని, అరెస్టు చేశారు. వారిని కోర్టులో హాజరు పరుస్తామని పెద్దారవీడు ఎస్ఐ పి అనిల్ కుమార్ తెలిపారు.



# జర్నలిస్టు శేషగిరిరావుకు ఆర్థిక సాయం



**(షణ్ముఖ వెలుగు, మద్దిపాడు, ఏప్రిల్ 8)**

మండలంలోని గాజుల పాలెం గ్రామంలో జర్నలిస్టు తెనాలి శేషగిరిరావు తల్లి తెనాలి లక్ష్మి లంగ్‌క్యాన్సర్‌తో బాధపడుతూ నాలుగోవ స్టేజీలో ఉండి ఆరోగ్యం క్షీణించడంతో కుమారుడు ఇంటి దగ్గర ఉండి తల్లి ఆరోగ్యం చూసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆదాయ వనరులు లేక ఇబ్బంది పడుతున్నానని ప్రకాశం జిల్లా కాపు సంఘం కార్యాలయానికి తెలియజేయగా ప్రకాశం జిల్లా కాపు సంఘం అధ్యక్షుడు కొక్కిరాల సంజీవకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం వారి గ్రామానికి వెళ్ళి వారి కుటుంబాన్ని కాపు సంఘం ఉపాధ్యక్షుడు , దాత నరహరి సాంబయ్య పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని కుమారుడు తెనాలి శేషగిరిరావుని అడిగి తెలుసుకున్నారు. దగ్గరుండి జాగ్రత్తగా చూసుకోవాలని తెలియజేసి, వారికి కాపు సంఘం ఉపాధ్యక్షుడు , దాత నరహరి సాంబయ్య చేతుల మీదుగా అనారోగ్యంతో ఉన్న తెనాలి లక్ష్మికి రూ.5,000 ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తంజావూరి శ్రీనివాసమూర్తి, ఆర్గనైజింగ్ కార్యదర్శి వుమ్మిడి శెట్టి శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యుడు లింగిశెట్టి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక వైద్యశాలలో రికార్డులను తనిఖీ చేసిన డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ సృజన

**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 8)**

స్థానిక ప్రాథమిక వైద్యశాలను మంగళవారం డిప్యూటీ డిఎంహెచ్ ఓ డాక్టర్ సృజన వైద్యశాలలోని అన్ని శాఖల సంబంధించి రికార్డుల పరిశీలించి ఏఎన్ఎంలకు ఆశా వర్కర్లకు తగిన సూచనలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామాలలో ఆరోగ్య సమస్యలు తెలుసుకొని వారికి తగిన సూచనలు ఇచ్చి మందులను పంపిణీ చేయాలని, ఏదైనా సమస్య ఉంటే ప్రాథమిక వైద్యశాలను సంప్రదించి తగిన చికిత్స పొందాలని వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు కృష్ణ చైతన్య, రవి కిరణ్, మల్లికార్జునరావు, ఉమేరా, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.



# గిరిజన యానాదులకు ఈ- శ్రమ కార్డులు





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 8)**

ఆంధ్రప్రదేశ్ గిరిజన యానాది సేవా సంఘం,అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం, ఏఐటియుసి అనుబంధం భవన నిర్మాణ కార్మిక సంఘంఆధ్వర్యంలో ఈ-శ్రమ కార్డులు ఒంగోలులోని గిరిజన భవన్‌లో మంగళవారం యానాదులకు తీయించారు. ఈ సందర్భంగా అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ ఈగ శ్రీనివాసరావు, భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి భూదూరి హరికృష్ణ మాట్లాడుతూ దేశంలో ఈ శ్రమ పోర్టల్లో కార్మికులు రిజిస్ట్రేషన్ చాలా వేగవంతంగా జరుగుతుంటే గిరిజన ప్రజలకు గిరిజన నాయకులకు ఈ శ్రమ కార్లు గురించి అంతగా అవగాహన లేకపోవడం విచారకరమన్నారు. ఈ నేపథ్యంలో ఏఐఎస్టిఈఏ, ఏపీ- జీ వై ఎస్ ఎస్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అవగాహన కల్పించి కార్మికులకు ఇ- శ్రమ కార్డులను తీయించి ఇచ్చామన్నారు. గిరిజన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా అసంఘటిత కార్మికులు రెండు లక్షలు ప్రమాదవశాస్తూ మరణించిన కుటుంబానికి రెండు లక్షలు, అంగవైకల్యం కలిగితే ద్వారా ఒక లక్ష పొందుతారని తెలిపారు. ఈ పథకానికి చిరు కార్మికులు,బిల్డింగ్ వర్కర్స్, స్ట్రీట్ వండర్స్, వ్యవసాయ కార్మికులు, అనేక మిషనరీతో పని చేసే కార్మికులు అర్హులని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ ప్రొఫెసర్ డాక్టర్ బాలాజీ నాయక్, ఓఎంసీ ఆడిట్ ఆఫీసర్ ఇండ్ల సాంబశివరావు, ఎలక్ట్రికల్ డిఈ సుధీర్ బాబు, రిమ్స్ ప్రొఫెసర్ డాక్టర్ సిహెచ్ సుధాకర్ బాబు, సనాతన హిందూ ధర్మ సాధన పరిషత్ ట్రస్ట్ జనరల్ సెక్రెటరీ సుదర్శన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

# ఉగాది పురస్కార గ్రహీత చల్లా నాగేశ్వరమ్మకు ఘన సన్మానం








(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 8)

సంగీత రంగంలో 30ఏళ్ల పాటు కృషి చేసి ఎన్నో అవార్డులను పొందిన గాయని చల్లా నాగేశ్వరమ్మ రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ద్వారా ఉగాది పురస్కారం అందుకోవడం అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా సంగీత కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో ఉగాది పురస్కార గ్రహీత చల్లా నాగేశ్వరమ్మను మంగళవారం ఘనంగా సత్కరించారు. ఎన్టీఆర్ కళాక్షేత్రంలో జరిగిన ఈ కార్యక్రమానికి కళాకారుల సమాఖ్య గౌరవాధ్యక్షుడు ఎన్ సుకుమార్, అధ్యక్షులు ఎస్ .కె.బాబు, కార్యదర్శి ఎ.మనోహర్, కోశాధికారి యు.కోటేశ్వరరావు నిర్వాహకులుగా వ్యవహరించారు. ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు వెంకట శ్రీనివాసులు, శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సంగీత సంస్థ ప్రతినిధి మద్దుల నరసింహారావు, విశ్రాంత బ్యాంకు మేనేజర్ గోపాలరావు .. తదితరులు అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ పద్మశ్రీ ఘంటసాల స్వరాంజలి కళా సంస్థ పేరుతో నాగేశ్వరమ్మ చేసిన కృషిని వివరించారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాలలో కచేరీలు నిర్వహించి... ఆధ్యాత్మిక, సాంప్రదాయ, జానపద... పాటలను ఆమె సమాజంలోకి విరివిగా అందించారన్నారు. ముఖ్యంగా అనేకమంది యువ గాయక, గాయణీ మణులను తీర్చిదిద్దడంతోపాటు పలువురు కళాకారులకు సన్మానం చేయడం నాగేశ్వరమ్మ ప్రత్యేకతగా వారు పేర్కొన్నారు. ఆమెకు పురస్కారం రావడం జిల్లాకి గర్వకారణంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన సంగీత కళాకారులు నాగమణి శ్రీనివాస్, లక్ష్మీ తులసి, శ్రీదేవి, నాగరాజు, వెంకటలక్ష్మి, నాగేంద్రమ్మ, వెంకటసుబ్బమ్మ, తదితరులు పాల్గొన్నారు






# పెంచిన గ్యాస్ ధరలు తగ్గించే వరకు ఉద్యమిస్తాం

## ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 8)

కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధర లను తక్షణమే ఉపసంహరించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి అన్నారు. స్థానిక సత్యనారాయణపురం లో ఐద్వా ఒంగోలు నగర కమిటీ ఆధ్వర్యంలో మహిళలు పెంచిన గ్యాస్ ధరలు ఉపసంహరించాలని నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ గృహ అవసరాలకు వినియోగించే సిలిండర్లకు, ఉజ్వల పథకం లబ్ధిదారులకు 50 రూపాయలు చొప్పున పెంచటం దారుణం అన్నారు. పెరుగుతున్న ధరలతో బ్రతుకులు ఎలా సాగించాలని ప్రజలు ఆవేదన చెందుతుంటే ప్రజల నెత్తిన గ్యాస్ సిలిండర్ల భారాన్ని వేయటం అమానుషమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఇస్తామన్న సిలిండర్ల మీద కూడా ఈ భారం పడుతుందని వెరసి ప్రజల మీద మోయలేని భారాలవుతాయని వీటిని తగ్గించే వరకు ఉద్యమించాలని అన్నారు. ఐద్వా నగర కార్యదర్శి జి ఆదిలక్ష్మి మాట్లాడుతూ గ్యాస్ ధరలతో పాటు పెట్రోల్ డీజిల్ ధరలు నిత్యం కేంద్ర ప్రభుత్వం పెంచుకుంటూ పోతున్నదని, రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల ధరలు పెంచుతూ సామాన్య మధ్యతరగతి ప్రజల జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సంపాదనల కంటే ఖర్చుల భారం పెరుగుతున్నదని పేద మధ్యతరగతి ప్రజల జీవితాలు అస్తవ్యస్తంగా మారుతున్నాయని ఈ స్థితిలో భారాలు తగ్గించి ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు ఇష్టారీతిన భారాలు మోపుటమేమిటనీ ఆమే ప్రశ్నించారు. పెంచిన ధరలు ఉపసంహరించే వరకు ప్రజలు ఉద్యమించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకురాళ్లు వై అంజనీ దేవి, కె రాజేశ్వరి, పి లక్ష్మి, వై మల్లేశ్వరి, వి విజయలక్ష్మి, కె భారతి, ఎన్ కుసుమ, బి జ్యోతి, కె ఈశ్వరమ్మ, పి సుజాత, యు ఉష, పద్మ, ఎన్ నాగమణి, పి పద్మ, సిహెచ్ రమణమ్మ, వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# వాస్తవ అంచనాలకు తగినట్లు రుణ, జీవనోపాధుల ప్రణాళిక

## డిఆర్డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి నారాయణ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 8)

స్వయం సహాయక సంఘాల సభ్యుల రుణ, జీవనోపాదుల ప్రణాళిక వాస్తవ అంచనాలకు తగినట్లు ఉండేలా నమోదు ప్రక్రియ చేయాలని డిఆర్డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి నారాయణ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న స్వయం సహాయక సంఘాల సభ్యుల రుణ ప్రణాళిక నమోదు ప్రక్రియలో భాగంగా మద్దిపాడు, తాళ్లూరు, ముండ్లమూరు, కురిచేడు, దొనకొండ , మండలంలో జరుగుతున్న నమోదు ప్రక్రియను ప్రాజెక్ట్ డైరెక్టర్ పరిశీలించారు. గతంలో ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ రుణాలతో పాటు స్త్రీనిధి వంటి వాటి నుండి రుణ సదుపాయం అందజేయటం జరిగేది. కొంతమంది సంఘ సభ్యులకు అవసరం లేనప్పటికి రుణ సదుపాయం అందించేవారు. దీంతో ప్రభుత్వం సభ్యుల వారీగా కుటుంబ అవసరాలకు, జీవనోపాధుల ద్వారా ఆదాయాభివృద్ధికి కావల్సిన పెట్టుబడి రుణప్రణాళిక తయారు చేసుకోవటం ద్వారా అవసరమైన సమయాల్లోనే రుణాలు అందించేలా నమోదు ప్రక్రియ చేయటం జరుగుతుందని ప్రాజెక్ట్ డైరెక్టర్ టి నారాయణ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 45 వేల సంఘాల్లోని 4 లక్షల 50 వేల మంది సభ్యుల నుండి సమాచారం సేకరించటం జరుగుతుందన్నారు. ప్రతి సభ్యురాలికి ఎప్పుడు రుణం అవసరమో, ఏ విధమైన రుణం అవసరమో నమోదు చేసి ఆ సమయానికి రుణసదుపాయం అందించేలా ప్రణాళిక తయారు చేయటం జరుగుతుందన్నారు. ప్రతి మహిళ రుణవినియోగం పూర్తిస్థాయిలో సక్రమంగా అవలంబించేలా చేయటం జరుగుతుందన్నారు. 2025-26 సంవత్సరానికి నమోదు ప్రక్రియ ఆధారంగా వార్షిక రుణప్రణాళిక తయారుచేసి ప్రభుత్వానికి అందజేయనున్నట్లు ప్రాజెక్ట్ డైరెక్టర్ తెలిపారు. సమాచార సేకరణలో తప్పుడు సమాచారం కాని నిర్లక్ష్య పూర్తి సమాచార సేకరణ గాని చేయకుండా సభ్యులు కోరుకుంటున్న విధంగా జీవనోపాధి, కుటుంబ అవసరాలు నమోదు చేయాలన్నారు. అందరూ వీవోఏ, సీసీలు, ఏపీఎంలు నమోదు ప్రక్రియ పూర్తియేంత వరకు, సరైన సమాచారం రావటానికి అందరు గ్రామాల్లో ఉంటూ ప్రతక్ష పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.




On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com